# శ్యామపర్వం

రమణి, శ్యామ, విజయలక్ష్మిలు దేహాలు వేరయినా ఒకే ప్రాణంగా జీవించే స్నేహితురాళ్ళు. వాళ్ళు ముగ్గురూ కూడా కోఠి ఉమెన్స్ కాలేజీలో బియ్యే చదువుతున్నారు. క్లాసులో వెనుక బెంచీలో కలిసి కూర్చునేవారు. విజయనగర్, శాంతినగర్‌లలో ఉండటం వలన వారి రాకపోకలు కూడా ఒకే బస్సులో జరిగేవి.

రమణి, విజయలక్ష్మిలు చాలా చిలిపి అమ్మాయిలు, సీమటపాకాయల మాటలు, ఎవరయినా, ఏదయినా ఒక జోకు పేలిస్తే చాలు, వాళ్ళు ఎడతెగని నవ్వులు మొదలుపెడతారు. క్లాసులో శబ్దం చేయకుండా, కేవలం శరీరాల్ని కదిలిస్తూ నవ్వే ఆ రమణి, లక్ష్మిలను లెక్చరర్లు ఎన్నో విధాలుగా శిక్షించేవారు. కానీ, అంతమాత్రంచేత, వాళ్ళు ఆ నవ్వులు అపుతారా!

ఈ ముగ్గురూ కూడా ఆర్థికంగా, కాస్త ఉన్న కుటుంబాల్లోంచి వచ్చినవాళ్ళే. ఐదడుగుల నాలుగంగుళాల ఎత్తున్న రమణి, లావు కాస్త ఎక్కువగానే ఉంటుంది. నలభై ఎనిమిదికిపైన సైజున్న ఆమె వక్షోజాల గురించి, స్నేహితురాళ్ళు ప్రత్యక్షంగా మగపిల్లలు కొంచెం పరోక్షంగా కామెంట్ చేసేవాళ్ళు.

“రమణీ! నీ అగ్ని పర్వతాలు ఎప్పుడు బద్దలవుతాయోననే భయంతో, అబ్బాయిలు నీ దగ్గరికి వచ్చి మాట్లాడటం లేదు.” అని ఒక స్నేహితురాలు అన్నప్పుడు.

“ఛీ....ఛీ...అదేం కాదు. అబ్బాయిలు దగ్గరకు వచ్చినప్పుడు, ఈమె కాస్త కదిలినా, తుమ్మినా, దగ్గినా, ఆ హెడ్‌లైట్స్‌ని అనుకోకుండా తాకడం వల్ల, కేసు అవుతుందేమో ననే భయంతో వాళ్ళు దగ్గరికి రావటం లేదు.” అని మరో స్నేహితురాలు చమత్కరిస్తుంది.

“ఓసేయ్! ఓసేయ్! మీరందరూ అసూయతో ఇలా అంటున్నారు. ఇవి ఒరిజినల్. సిలికాన్ ఎక్కించి పెద్దవి చేసినవి కావు.” అని గర్వంగా జవాబిస్తూ రమణి కూడా వాళ్ళ నవ్వులతో జత కలిపేది. ఆ సందర్భంలో చర్చావిషయమైన ఆమె ఆ మనోహర భాగాలు త్వరితనృత్యం చేస్తాయి.

“లేటెస్ట్ అయిన కొన్ని కార్లకి ఆక్సిడెంట్ జరిగితే బెలూన్‌లు లేచి వస్తాయట.” అని ఒక వీరుడు. “సేఫ్టీ ప్రొవిజన్స్ ఇన్ ఆటోమొబైల్” అనే సబ్జక్టు గురించి చెప్పినప్పుడు.

"అన్నయ్యా! ఈ ఊరిలో దాని అవసరమూ లేదే! అటువంటి బిల్ట్ ఇన్ ప్రొవిజన్ ఉన్న మనుష్యులే ఇక్కడ ఉన్నారు." అని వయసులో ఒకటిన్నర నెలలు తక్కువున్న ఇంకొక స్నేహితుడు జోడిస్తాడు.

ఇదంతా విని, నవ్వేమి రావడం లేదన్నట్లు నటిస్తూ, ఆ ముగ్గురమ్మాయిలు సీరియస్ మూడ్‌లో నడిచి వెళ్ళిపోతుంటారు. తరువాత దాని గురించి చెప్పి, విజయలక్ష్మి, రమణిని ఏడిపిస్తుంది. శ్యామ చిన్నగా నవ్వుతున్నట్లు పెదవులు కదుపుతుంది. కానీ, ఇటువంటి అటల్లో లేదా నవ్వులలో ఆమె ఎప్పుడూ పాలుపంచుకోలేదు.

విజయలక్ష్మి ఎత్తు ఐదున్నర అడుగులు. దానికి తగ్గ లావు, బంగారు రంగు గల ఆమె అందమంతా, ఆమె గిరజాల జుట్టులోనే దాగుంది.

"అమితాబ్ చెల్లెలా!"

"కాదురా! వైజయంతి మాల కూతురు."

"ఈ జుట్టు చూస్తే, నెమలికి కూడా ఈర్ష్య కలుగుతుందేమో!"

ఇటువంటి వ్యాఖ్యలు వినేటపుడు, విజయలక్ష్మికి తను గగనవిహారం చేస్తున్నానేమోననే అనుభూతి కలుగుతూ ఉంటుంది.

కానీ, ఇవన్నీ వినేటప్పుడు, గుండెల్లో ఒకవిధమైన నొప్పి, ఒకరకం బెక్కు. పెల్లుబికి వచ్చేది మరెవ్వరికో కాదు శ్యామకే.

దాదాపు అందరాడపిల్లలని వెక్కిరించే అలవాటు కొంటె కుర్రాళ్ళకు సాధారణంగా ఉండేదే. కానీ, వాళ్ళల్లో ఒక్కడూ నా గురించి ఎందుకు కామెంట్ చేయట్లేదు. నిర్లక్ష్యమనే అగ్నిలో తను కాలిపోతున్నట్టు ఆమెకు అనిపించేది. ఏ యువకుడయినా, ఆమెపట్ల సానుభూతి చూపడం కోసం ఒక కామెంట్ విసిరితే మాత్రం, అది...

"ఓ! పాపం మేన్‌ఛెస్టర్" అని కావచ్చు.

తనని ఎందుకు ఇలా చిత్రవధ చేస్తున్నారని శ్యామ తనలో తను కుమిలిపోయేది.

"స్నేహితురాళ్ళకు ఎక్కువగా ఉన్నదాంట్లోంచి ఈమెకు కాస్త ఇవ్వకూడదా పాపం!" అని ఇంకొకడు సానుభూతి ప్రకటించినపుడు, "దేవుడు, కేవలం నన్ను మాత్రమే ఎందుకిలా సృష్టించాడు? మంచి ఎత్తు ఇవ్వలేదు. మంచి రంగు ఇవ్వలేదు. పుష్టిగల ఆకారం ఇవ్వలేదు. అందమైన జుట్టు ఇవ్వలేదు. అందరికీ నచ్చే ముఖం ఇవ్వలేదు. నా విషయంలో దేవుడు ఎందుకింత నిర్ధయుడైనాడు!" అంటూ ఆమె విలపించేది.

వాస్తవానికి, బ్రహ్మదేవుడికి కళా నైపుణ్యాలేవీ ఆమెలో లేవు. ఎత్తు నాలుగడుగుల పదంగుళాలు, ఒంటిరంగు, నలుపని చెప్పడానికి వీల్లేదు కానీ, దాదాపు రోజ్‌వుడ్ కలర్ లాగే ఉంటుంది. ఆమె మరీ ఎముకలగూడులా ఉండదు, కానీ, అవసరమైన భాగాల్లో అయినా కాస్త కండ అనేదే లేదు. ప్రభాత శుభశకున దర్శనానికి పనికిరాని ముఖం అని, ఆమె గురించి ఎవ్వరూ చెప్పరు కానీ, ఆ విధంగా ఆ ముఖాన్ని చూడటం, ఎవ్వరికీ ప్రియంగా ఉండదేమో! ఆ ముఖం అంత వికారంగా ఉండదు కానీ, అంత ఆకర్షణీయంగా కూడా ఉండదు. ఆ వదనం తెల్లబడినా, నల్లబడినా ఒకేలా ఉంటుంది బియ్యే పాసయ్యేదాకా ఆమెకు వీపు సగం వరకూ దిగిన తీగల్లాంటి జుట్టుండేది. ఎమ్మే పాసయ్యేసరికి ఎలకతోక అనే కీర్తి వచ్చే విధంగా, జుట్టు ఊడిపోవడం మొదలయ్యేసరికి, ఆమెకి చాలా బాధ కలిగింది. జుట్టు రాలడాన్ని ఆపుతుందని, గొప్పలు చెప్పుకునే ఎన్నో రకాల షాంపూలు, కండీషనర్లు, కేశతైలాలు, ఆమె వాడి చూసింది. జుట్టు ఊడిపోవడాన్ని ఆపడానికి బదులు, అది జుట్టు ఊడిపోవడానికే దోహదపడింది. "మేరా భారత్ మహాన్" ఆమెకి బట్టతల మాత్రం రాలేదు.

కాలేజీలో చదువుకునే రోజుల్లో, అబ్బాయి లెవరయినా తనను చూసి కామెంట్ చేయాలని ఆమె ఉవ్విళ్ళూరుతుండేది. కానీ, ఆ కోరిక తీర్చడానికి ఎవ్వరూ సహకరించలేదు. ఎవ్వరయినా విజయలక్ష్మిని ఉద్దేశించి.

"వైజయంతి రేపు నీలం చీర కట్టుకుని వస్తుంది," అని అంటే, ఆమె పచ్చరంగు చీర కట్టుకుని వచ్చేది. కానీ, పాపం శ్యామ, ఆ రోజు నీలం చీర కట్టుకుని ఉండటం, ఆ కామెంట్ చేసేవాళ్ళు ఎవ్వరూ గమనించరు.

"సమృద్ధ లక్ష్మి ఎందుకు పువ్వులు పెట్టుకోవడం లేదు? రేపు మంచిరోజు, తప్పకుండా పూలు పెట్టుకోవడం మరిచిపోకు సుమా!" అని రమణి నుద్దేశించి, ఎవడయినా అంటే దాన్ని ఖచ్చితంగా పాటించేది శ్యామ. ఆమె ఏం ధరించినా, ధరించకపోయినా, ఎవ్వరూ ఏమీ అనరు. ఎంత నిర్లక్ష్యం! రోజు రోజుకీ, ఆమె చింత పెరుగుతూ వచ్చింది కానీ, విజయలక్ష్మి రమణిల హాస్యాలు, వేళాకోళాలు వింటూ, చూస్తూ శ్యామ కూడా కాస్త నవ్వుతూ ఉండటం వల్ల ఆమె హృదయంలో విస్తరిస్తూ వచ్చిన బాధ గురించి తెలుసుకోవడానికి, ఆ ప్రాణస్నేహితురాళ్ళకి కూడా సాధ్యం కాలేదు.

బియ్యే పాస్ కాగానే, ఆమెరికా నుంచి ఇంజనీర్ బొల్లిగద్దలా విజయలక్ష్మిని తన్నుకుపోయాడు. మరో నాలుగు సంవత్సరాల్లో ఆమెకి రెండు చిన్నారి మగ గద్దలు పుట్టుకొచ్చారు.

రమణి పెళ్లికి కూడా ఎక్కువ ఆలస్యం కాలేదు. హైదరాబాదులోనే ఉన్న ముఫ్ఫై రెండేళ్ళ డాక్టరు. స్టెతస్కోపు లేకుండా ఆమె హృదయస్పందన వినడం మొదలుపెట్టాడు. రమణి దృష్టిలో, తనకి భర్తకి వయసులో కాస్త ఎక్కువ తేడా ఉండటం మంచిదే. అతని వాత్సల్యపూర్వమైన ప్రేమప్రకటనల గురించి రమణి చెప్పడం విని, శ్యామపైకి సంతోషం నటించింది కానీ, స్నేహితురాలి సుభాసుభవాల వివరణలు, ఆమె హృదయ వ్రణంపై సోడియం క్లోరైడ్ చల్లినట్లుండేది. రమణికి, ఒక కూతురు పుట్టగానే, ఆమె భర్త, “నీలాంటి ఒక కూతురిని, ఆ భగవంతుడు మనకి ప్రసాదించాడు. అదే పదివేలు. నాలాంటి ఒక చరకుడి కోసం మనం ఇంక ప్రయత్నించక్కర లేదు. ఈ ప్రపంచంలో ఇప్పటికే వైద్యులు గుంపులు గుంపులు అయిపోయారు.” అన్నాడు.

శ్యామ తండ్రి మధుసూదనరావు ఒక చార్టర్డ్ అకౌంటెంట్. అతని గృహలక్ష్మి అయిన సీతాలక్ష్మి నిజంగా ఒక ప్రేమలక్ష్మి. వాళ్ళ దాంపత్య మల్లెలో పూసిన రెండు కుసుమాలు శ్యామ, రాధ, అమ్మా, నాన్న మంచిరంగు కావడం వల్ల రాధకి ఆ రంగే వచ్చింది. కానీ, అమావాస్య రాత్రిలో పుట్టడం వల్ల కాబోలు, ఆ చంద్రుడి ప్రభావం శ్యామ మీద రవ్వంతయినా లేదు.

శ్యామకన్నా మూడేళ్ళు చిన్నదయిన అందగత్తె రాధకి బియ్యేస్సీ చదువుతున్న రోజుల్లోనే పెళ్ళి సంబంధాలు రావడం మొదలు పెట్టాము. కానీ, శ్యామకి మాత్రం అరకొరగా సంబంధాలు వస్తుండేవి. అయితే, పెద్దమ్మాయికి పెళ్ళి జరగనిదే, చిన్నమ్మాయి పెళ్ళి చేయకూడదనేది మధుసూదనరావు దంపతుల అభిమతం.

రాధ, ఎమ్మెస్సీ, పి. హెచ్.డి. రెండూ పూర్తి చేసేసరికి, ఆమెకి ఎన్నో మంచి సంబంధాలు వచ్చాయి. వయస్సు కూడా ఇరవై అయిదు దాటింది. పెద్దమ్మాయికి ఇరవై ఎనిమిది. ఇకముందు, రాధకి వచ్చే పెళ్ళి సంబంధాలని ఉపేక్షించడం ఏమాత్రం మంచిది కాదని, తల్లిదండ్రులకి అనిపించింది. రాధని చూడటానికి ఇద్దరబ్బాయిలు వచ్చారు. ఇద్దరికీ ఒకే అమ్మాయిని ఇవ్వడం సంప్రదాయం కాదు కాబట్టి, వాళ్ళల్లో మంచి కుటుంబం నుంచి వచ్చి, ప్రత్యేకంగా డిమాండ్లేమీ చెయ్యని సి.సి.ఎమ్.బి.లో సైంటిస్ట్ అయిన వేణుగోపాలరావుకి, రాధని కన్యాదానం చేయడానికి, మధుసూదనరావు సంతోషంగా అంగీకరించాడు.

పెళ్ళి రోజు దగ్గరపడిన కొద్దీ, శ్యామ తన మనస్సులో పెల్లుబుకుతున్న వేదన బయటపడకుండా జాగ్రత్తపడింది. తన వైఖరి వల్ల రాధకి ఎలాంటి బాధ, అనుమానం కలగకుండా శ్రద్ధ తీసుకుంది. చెల్లెలి పెళ్ళి విషయంలో అందరికన్నా ఎక్కువ సంతోషించేది తనే అన్న భావము, తన ముఖ కవళికలు, సంభాషణారీతి ద్వారా ఆమె ప్రతిఫలింపజేసింది.

అయినా కూడా, పెళ్ళిరోజు, వచ్చినవాళ్ళని పలకరిస్తూ, కుశలప్రశ్నలడుగుతూ తిరుగుతున్నా, నాలుగయిదు రోజులు శవపేటికలో ఉండి వచ్చినట్టు, ఒక విధమైన వివర్ణత, ఆమె ముఖంలో కొట్టొచ్చినట్టు కనబడింది.

పెళ్ళితతంగాలు జరుగుతుండగా, వధువు వెనకాలే నిలబడిన శ్యామకు, తన మెడలో కూడా తాళిబొట్టు, పువ్వుల దండలు పడుతున్న దృశ్యాలు మనసులో అస్పష్టంగా మెదిలాయి. వధూవరులకు అభినందనలు, ఆశీస్సులు లభిస్తుండగా, న్యాయంగా అవి తనకే రావాల్సినవి కదా అని, చెల్లెలు తనని అతిక్రమించి వెళ్ళిపోయిందే అనే బాధ ఆమె మనసులో ముళ్ళులా గుచ్చుకున్నాయి. ఎప్పుడయినా, తన వివాహం కూడా ఇలాగే జరుగుతుందా అని ఆలోచించేటపుడు, ఆమెలో నుంచి వచ్చిన నిరాశ, నిస్పృహలు వేరెవరూ గమనించకుండా జాగ్రత్తపడింది.

ఆ రోజు రాత్రి వరుడి ఇంటిలో రాధ తన మొదటి రాత్రి వేడుక జరుపుకునేటపుడు అంధకారపు తెర వెనుక, మెత్తమీద బోర్లపడి కన్నీరు కారుస్తున్న శ్యామ అది తన చరమ రాత్రి అయితే, ఎంత బాగుండేదని అనుకునేది.

రోజులు అలా గడిచిపోయాయి. ఆశలు లేని... మోహాలు లేని...వసంతాలు లేని...స్వప్నాలు లేని ఆ కాలం, శ్యామను గతిశీలయైన ఒక జీవచ్ఛవంలా మార్చింది.

రాధ పెళ్ళి జరిగి మూడు నెలలే అయింది. ఆ లోపల ఆమె గర్భవతన్న శుభవార్త విని గంతులు వేస్తున్న తల్లిదండ్రులను చూసి శ్యామకు ఉక్రోశం కలిగింది. "వీళ్ళ సంబరం చూస్తుంటే, ప్రపంచంలో ఏ స్త్రీకి గర్భధారణ జరగనట్టుంది. పెళ్ళి తరువాత, స్త్రీలు గర్భం ధరించడం సర్వసాధారణమే కదా! దానికి ఈ రకంగా శీర్షాసన విన్యాసాలు ఎందుకు చేయాలి? పెద్దకూతురు ఇక్కడిలా మోడులాపడుందనే ఆలోచన కూడా ఈ తల్లిదండ్రులకి లేకపోయిందే! ఇందులో వీళ్ళని తప్పుపట్టడానికి ఏముంది? ఇంత చదువుకున్న రాధ అయినా కనీసం ఆలోచించాలి కదా! తన అక్క అక్కడ అవివాహితగా ఉందని, నా వివాహం ఆయ్యే వరకూ ఈ గర్భధారణ ప్రోగ్రామ్ వాయిదా వేసుండవచ్చు కదా! ఆమె కింత తొందరెందుకు? అగ్నికి అజ్యం తోడయినట్టు ఉంది కదా ఈ పని?"

రోజులు అలా దొర్లిపోతుండగా, రాధ ఉదరం ఎంత పెరుగుతూ వచ్చిందో, అంతకు వందరెట్లు శ్యామ ఇంటిలో, రాధ అత్తగారింటిలో సందడి పెరుగుతూ వచ్చింది. రాధ యింటికి, శ్యామ తల్లిదండ్రులతో పాటు రెండు మూడు సార్లు మాత్రమే వెళ్ళింది. రాధ గర్భధారణ విషయం విన్న తర్వాత, ఆమె అసలు ఆ యింటి ఛాయలకేపోలేదు. రాధ తమ

ఇంటికి వచ్చినా, ఆమెని అభినందించలేదు, సరిగదా అసలు ఆ సంగతే ప్రస్తావించలేదు. పాపం, పెళ్ళికాని అమ్మాయి అటువంటి విషయాలు ఎలా మాట్లాడగలను?

రాధ రోజురోజుకు ఒక వి.వి.ఐ.పిగా తయారయింది. ఆమె కోరినదేమైనా తీర్చడానికి భర్తా, అత్తామామలు, తల్లిదండ్రులు, అందరూ పోటీపడసాగారు. అవన్నీ చూసి, శ్యామకు రాధంటే విరోధం కలగలేదు, కానీ, అసూయాగ్నిలో ఆమె దహించుకుపోయింది.

పూర్వం, ప్రసవం పుట్టింట్లో జరగాలా లేక అత్తగారింట్లో జరగాలా అనే విషయంలో కొన్ని ఆచారాలు, పట్టింపులు ఉండేవి. కానీ, ఈ రోజుల్లో పెద్దపెద్ద పట్టణాల్లో, నగరాల్లో, మెటర్నిటీ హోమ్స్ అనే ప్రసూతి ఆసుపత్రులే, పుట్టినిల్లు, మెట్టినిల్లు స్థానాలని ఆక్రమించాయి కదా!

రాధ ఏ ఆసుపత్రికి వెళ్ళాలి, ఏ డాక్టరుని సంప్రదించాలనే వివరాలు, వేణుగోపాలరావు, తన తల్లిదండ్రులతో చర్చించి తీర్మానించాడు. ఈ విషయంలో రాధ తల్లిదండ్రుల అభిప్రాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకున్నాడు. రాధ అత్తగారింట్లో ఎలాంటి వేడుకలు, సంబరాలు జరిగానా, శ్యామకు ఎటువంటి అభ్యంతరముండేది కాదు. చెల్లెలు ఒక రాకుమారిలా జీవితాన్ని ఆస్వాదించడం పట్ల కూడా ఆమెకి బాధ ఉండేది కాదు. కానీ, తన తల్లీ తండ్రికి రాధ గురించి, ఆమె గర్భం గురించీ తప్ప, మాట్లాడటానికి మరే విషయము లేదే అని ఆలోచించినపుడు, ఆమెకి బాద, కోపమూ కలగాపులగంగా కలిసివచ్చేది.

రాధ ఉదరంలో పెరుగుతున్నది ఒక మగబిడ్డని తెలిసినపుడు, ఆ రెండిళ్ళ యింటికప్పులు మింటికెగసి పడటం చూసి, శ్యామకు చిర్రెక్కింది. “ఛీ ఛీ వీళ్ళెంత సంకుచిత మనస్కులు కడుపులోని బిడ్డ ఆడైనా, మగైనా ఒకటే కదా. ఈ ఆధునిక యుగంలో కూడా ఆడపిల్లలంటే ఇంత చిన్నచూపా! అబ్బాయి పుట్టబోతున్నాడని తెలిసి అంత పొంగిపోవడానికీ, అమ్మాయి పుట్టబోతోందని తెలిసి కుంగిపోవడానికి మాత్రం ఏముంది?” తన తల్లిదండ్రులు కూడా ఇలా ఆలోచించడం, ఆమెకి అవమానకరంగా తోచింది.

అబ్బాయి పుట్టిననాడు ఆ రెండు కుటుంబాల్లో కూడా ఒక మహోత్సవ వాతావరణం నెలకొంది. బాబుని గది బయటికి తీసుకునివచ్చిన వెంటనే, అమ్మానాన్నతో కలిసి, శ్యామ కూడా వాడిని చూసింది. కళ్ళు సగం తెరిచి ఉన్న ఒక వెన్నముద్ద, మంచి బంగారుఛాయ, ఆ కోమల ముఖాన్ని చూసేటప్పుడు, ఆమెకు తెలియకుండానే హృదయంలోనుంచి వాత్సల్యభావం పొంగిపొర్లింది. అయినా కూడా, ఆమెలో లోపల్నుంచి వేదనతో కూడిన రోదనం, ఆమె జీవనాడులను తాకుతూ బహిర్గతమైన విషయం, ఆమెకు మాత్రమే తెలుసు. తనతో మరీ ఇంత క్రూరత చూపిస్తున్న, ఆ సర్వేశ్వరుడిని ఆమె శపించింది కావాలని కాదు.

అలా శపించకుండా ఉండటం ఆమెకు సాధ్యం కాలేదు. మరుక్షణంలో దేవుడిని శపించిన విషయంలో కలగాల్సిన పశ్చాత్తాపభారం, ఆమెని లొంగదీయలేదు.

హాస్పిటల్‌లో ఎక్కువసేపు ఉండకుండా, శ్యామ ఇంటికి తిరిగి వచ్చేసింది. ఇంటి విషయాలు చూసుకోవడానికి. తరువాత కూడా తల్లిదండ్రుల ఒత్తిడిమీదనే, ఆమె వాళ్ళతో పాటు, రాధ యింటికి అప్పుడప్పుడు వెళ్ళడం జరిగింది. ఎప్పుడో ఒకసారి, ఆమెకు బాబుని ఎత్తుకోక తప్పేది కాదు. కానీ, ఆమె ఆబాబుని ఎన్నడూ గుండెలకు హత్తుకోలేదు, ముద్దాడలేదు. అలాగని, ఆ శిశువుతో విరోధమేమీలేదు కానీ, వాడు తన కడుపున పుట్టి ఉంటే, ఎంత బాగుండేదని ఆమెకు అనిపించింది.

తన మనసులో చెలరేగుతున్న భావాలు బయటపడకుండా, ఆమె జాగ్రత్తపడింది. రాధతో, ఆమె అత్తింటివారితో, శ్యామ ఎంతో మంచిగా వ్యవహరిస్తున్నట్టు నటించింది. ఆ యింటివాళ్ళందరూ ఆమెను తమ కుటుంబ సభ్యురాలిగానే చూసేవారు. నిజానికి వాళ్ళకి శ్యామపట్ల ఉండేది ఆత్మార్థతతో కూడిన సహతాపం.

అలాంటి సహతాపాల సమ్మిళిత ఫలంగా కావచ్చు, కష్టజాతక, శ్యామ వర్ణానికి, ఒక శ్వేత పరివర్తనం సంభవించింది. ముప్ఫై నిండి, ముప్ఫై ఒకటి వచ్చేలోగా, ఆమెకి ఒక పెళ్ళి సంబంధం ఖాయమైంది. వరుడు, మిడిల్‌క్లాస్ కాంట్రాక్టర్ అయిన జనార్ధనరావు. అతను కర్ణాటకలో, ఏవేవో నిర్మాణాలలో, తలమునకలుగా ఉండటంవల్లనే, ముప్ఫై ఐదేళ్ళ వరకూ పెళ్ళికి టెండర్ పంపించకుండా ఉండిపోయాడు. ఆ వయసులో అతడికి కావలిసింది ఒక భార్య మాత్రమే. శ్యామకు కావలసింది కూడా బర్త అనే వ్యక్తి. ఆ విధంగా, పరస్పర పరిచయం కాకుండానే, వారిద్దరి మధ్య ఒక భావైక్యత ఏర్పడింది.

మధుసూదనరావు. ఈ పెళ్ళి సంబంధం గురించి కాస్త సంకోచిస్తూ, కూతురితో మాట్లాడుతున్నప్పుడు, నా విషయంలో మంచీచెడూ ఏమిటో మీకే బాగా తెలుసు. మీరేది నిర్ణయించినా అది నాకు సమ్మతమే అని శ్యామ చెప్పింది.

పెళ్ళిచూపులనే కార్యక్రమం జరిపించకుండానే వారి వివాహం నిశ్చయమైంది. జనార్ధనరావుకి పెళ్ళి అనే తతంగానికి సమయం వృథా చేయడం అస్సలు ఇష్టంలేదు. శ్యామను ఏదో ఒక సందర్భంలో చూశాడు కాబట్టి, ఆమె ఒక విజిటర్‌లాగా తన యింటికి వచ్చేస్తే చాలనేది అతని అభిప్రాయం. నిజం చెప్పాలంటే, అతని జీవితంలో పెళ్ళికిగానీ, భార్యకిగానీ, పిల్లలకిగానీ, కేటాయించడానికి సమయమేలేదు. ఎంతో కష్టపడి పనిచేస్తేనే, అతనిప్పుడున్న స్థాయిలో కొనసాగగలడు. కారుకి, పెట్రోలుకి, డ్రైవరుకి ఎంతో ఖర్చువుతుంది.

అరసికమైన అతని జీవితంలో, ఏకొంచెమయినా సుఖాన్ని పొందాడంటే, అది విస్కీ తాగినప్పుడు మాత్రమే, తన సుఖసాయం, సమయాలకు, కావలసిన తాళంచెవి 'విస్కీ' లోనే ఉందని తాగినప్పుడు అతను అంటుండేవాడు. ఒక మధ్యతరగతి కాంట్రాక్టర్ కావడం వల్ల స్కాచ్ సేవించడం అతని ఆరోగ్యానికీ, అతని అతిథుల ఆరోగ్యానికి మంచిదని, అతను నమ్మాడు. ఆ నమ్మకపు ఆరోగ్యమే, అతనిని నిత్య పానప్రియుడిగా మార్చింది.

శోభనంనాటి రాత్రి, శ్యామ, "ఏమాత్రం, పరిచయంలేని వ్యక్తి కదా ఈయనతో ఇంతవరకూ ఒక్కసారి కూడా మాట్లాడలేదు. అతనికి నేను నచ్చానోలేదో! రాత్రి అతనెలా వ్యవహరిస్తాడో ఏమో! లైంగిక విషయంలో అతనొక మృగంగా మారుతాడేమో దేవుడా! బలప్రయోగంతో నన్ను లొంగదీసుకుంటాడేమో! లేదా, నేనొక మంచి అమ్మాయినని, నామీద ప్రేమా, దయా కురిపిస్తాడేమో! అయినా నేను నచ్చిన తరువాతే కదా, అతను పెళ్ళికి ఒప్పుకున్నాడు, అందుకే, ఎటువంటి సమస్యా కలగకపోవచ్చేమో!" అని ఆలోచిస్తూ, తను ఎంతో కాలం నుంచి ఎదురుతెన్నులు చూస్తున్న ఆ మొదటి రాత్రి శుభవేళ గురించి, ఆశలనూ, ఆశంశలనూ, పడుగుపేకల్లాగా పేనవేసుకుని కూర్చుంది.

ఆయింట్లో, ఆశుభదినాన కూడా జనార్ధనరావు బంధువలెవరూ ఆగలేదు. అతని చిరకాల సేవకుడైన, అంజయ్య ఉత్తి వంటవాడే కాదు, జనార్ధనరావు బాగోగులన్నీ కూడా అతనే చూసుకుంటూ ఉండేవాడు. తన యజమాని పెళ్ళి గురించి ఎక్కువగా సంతోషించింది అతనే. పెళ్ళి అయ్యాక అయినా, తన బాధ్యతలలో సింహభాగం, కొత్త యజమానురాలు తీసుకోవచ్చుని ఆశించాడు. శోభనం రాత్రి, జనార్ధనరావు, తన ఇద్దరు తాగుబోతు స్నేహితులతో కలిసి తాగడం, అతనికేమాత్రం నచ్చలేదు. రెండుసార్లు, శోభనంగదిలో వేచి ఉన్న పెళ్ళికూతురి గురించి, అతను సూచించినపుడు, అక్కడ టీవీ ఉంది కదా! ఆమె అది ఆన్‌చేయలేదంటే, నువ్వెళ్ళి పెట్టిరా!" అని జనార్ధన్ చెప్పాడు. రాత్రి పదకొండు దాటిన తర్వాత కూడా, ఆ తాగుడు కార్యక్రమం కొనసాగడం చూసి, అంజయ్య భోజనం గురించి గుర్తుచేసాడు. పెళ్ళికూతురి భోజనం పడకగదిలోకి పంపించమనే ఆదేశం అతఢికి లభించింది. తనకి భోజనమక్కరలేదని శ్యామ చెప్పినప్పుడు, అంజయ్య ఎంతో బాధగా వెనక్కి తీసుకుపోయాడు. ఒక్క రోజయినా పూర్తి చేసుకోని భర్త గురించి, అంజయ్యను ఏదయినా అడగడానికి ఆమె సంకోచించింది. కానీ, కింది అంతస్తు నుంచి వినిపించే నవ్వులూ, కేకల ద్వారా ఆమెకు సంగతి అవగతమైంది. "అతను బాగా తాగొస్తే నామీద చెయ్యిచేసుకుంటాడేమో" అని భయపడినపుడు, ఆమె మనసే కాదు, శరీరం కూడా కంపించింది.

అర్ధరాత్రి పన్నెండున్నర కావటంతో, పెళ్ళికొడుకు శోభనపు గదికి చేరుకున్నాడు. తలుపుతోసి, అతను లోపలికి వచ్చేటపుడు, ఆమె బెదిరిపోయింది.

"సారీ పిల్లా.... సారీ! గుడ్‌నైట్" అంటూ, అతను షర్టు తీసి, ఒక కుర్చీ మీద గిరాటేసి, చెప్పులు ఒక మూలకి విసిరేసి, ఇంకొక్క క్షణం కూడా ఆగ కుండా, ఒక్కసారయినా పెళ్ళికూతుర్ని వెనక్కి తిరిగి చూడకుండా, మంచంమీద పడిపోయాడు. మరో రెండు నిముషాల్లో గురక కూడా మొదలు పెట్టాడు. శ్యామకి, ఆ తరువాత ఏం చేయాలో తోచలేదు. టీవీ, లైట్లు, ఆర్పేసి, బెడ్‌లైటు వెలుగులో ప్రక్కనే ఉన్న సోఫాలో కూర్చుంది. ఆ రాత్రివేళ, గాఢనిద్రలో ఉన్న, ఒక అపరిచితుడైన భర్త మంచం మీద పడుకోవడానకి ఆమెకి మనస్కరించలేదు. సోఫాలో కూర్చున్న శ్యామకి ఎప్పుడు నిద్రపట్టిందో తనకే తెలియదు. మర్నాటి ఉదయం కళ్ళుతెరిచేసరికి, ఏడుగంటలయ్యిందని తెలిసికొని, ఆమె కంగారుగా చటుక్కున లేచింది. మంచం మీద జనార్ధనరావు లేకపోవడం చూసి, ఆమె కంగారు రెండింతలయ్యింది. అతను స్నానం చేస్తున్నాడేమోనని చూడ్డానికి, స్నానాలగది తలుపుకి, చెవి ఆనించి నిలబడింది. లోపలనుంచి, ఎటువంటి చప్పుడూ రావటంలేదు. ఒక పిల్లిలా, ఆమె తలుపు మెల్లగా తోసింది. (ఛీ...ఛీ...పిల్లులు తలుపు తెరుస్తాయా! వాటికి అంత బలముంటుందా! ఇక్కడ ఉద్దేశించిన అర్థం మరేమీకాదు, కాస్తయినా చప్పుడు చేయకుండా తలుపు తెరిచిందని అంతే...) అతను బాత్రూములో కూడా లేడని తెలిసేసరికి, ఆమె భయం నాలుగింతలైంది. వణుకుతున్న కాళ్ళతో, మెట్లు దిగి, ఆమె వంటగదిలోకి వెళ్ళినపుడు, ఒక కప్పు వేడి టీతో, అంజయ్య ఆమెకు స్వాగతం పలికాడు. ఆ కప్పు, చేతిలోకి తీసుకోకుండా, ఆమెని సరిగా చూడని, ఆ ప్రాణనాథుడు, తెల్లవారుజామునే ఎక్కడికి మాయమైనాడని అడిగింది. ఆ టీ కప్పు, ఆమె చేతిలో పెట్టి, పెందరాళే ఏదో ఫోను రావడంతో, అతను బయటికి వెళ్ళాడనీ, తిరిగొచ్చేసరికి రాత్రవుతుందని, కావాలంటే, ఆమె పుట్టింటికి వెళ్ళి, పగలంతా గడపవచ్చని అతను చెప్పాడని, ఆ నమ్మినబంటు సెలవిచ్చాడు. ఆ టీని కాస్త గొంతులో పోసుకుని, తిరిగి పడగ్గదికి వచ్చి, వెనకటి రాత్రి తనకు ఆశ్రయమిచ్చిన, ఆ సోఫాపై వెల్లకిలా పడుకుని, శబ్దం చేయకుండా వెక్కివెక్కి ఏడ్చింది. ఏ స్త్రీ అయినా శారీరక, మానసిక లోపాలులేని, ఏ అమ్మాయి అయినా, టన్నులకొద్దీ ఆశతో, మిన్నంటిన ఆకాంక్షతో ఎదురుచూస్తున్న జీవితంలో, తొలి అనుభవమయ్యే తొలిరాత్రి, తన విషయంలో మాత్రం ఇంత చేదయిపోయిందే ఇంత నిరాశాజనకమైపోయిందే....తన జీవితంలో, దౌర్భాగ్యాల నిరంతర పరంపరకు అంతులేదా.....ఆ మంచిరోజు కోసం తనెంతకాలం వేచి ఉంది? ఆ సుదినం చాలా ఆలస్యంగా వచ్చినపుడు, ఎడారిలో దాహజలం కోసం పరితపిస్తూ తిరుగుతున్న బాటసారికి ఒయాసిస్ ఎదురయినట్టు అనిపించింది. కానీ, అక్కడికి చేరడంతో, అదొక మృగతృష్ణగా

పరిణమిస్తే, జీవితమే ఒక 'డెడ్ ఎండ్' కి చేరినట్టు అయిపోయిందే అని కన్నీరు కార్చింది. దేవతలందరినీ శపించింది. దేవుళ్ళు తమ తమ సుఖాల కొరకు ఎన్నెన్ని తప్పులు చేస్తున్నారు....అధర్మమార్గంలో పయనిస్తున్నారు...ఎవరికీ, ఎలాంటి ద్రోహం చేయని ఒక స్త్రీని ఇంతగా ఎందుకు బాధపెట్టాలి....కొలిమిలో పెట్టి కాల్చడం ఆ సర్వశక్తుడు చేయాల్సినపనేనా?

ఆ రోజు, ఆమె ఇల్లు కదిలి బయటికే రాలేదు. అంజయ్య బలవంతం మీద, ఆమె ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏదో కాస్త ఎంగిలిపడింది. ఉదయం పదిన్నరకి తల్లి ఫోన్ చేస్తే, భర్త బయటికి వెళ్ళినట్లు ఆమె చెప్పలేదు. కాస్సేపటికి, రాధ ఫోన్‌చేసింది. ముందు రాత్రి ఏవేవో జరిగుండవచ్చని ఊహించుకుని, చిలిపి, చిలిపి ప్రశ్నలతో అక్కని అటపట్టించింది. దాంపత్య జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించినట్టు, శ్యామ జవాబిచ్చింది. ఆ పగలు ఏవో పుస్తకాలు చదువుతూ, మధ్యాహ్నం సుషుప్తిలోకి జారిపోయింది. నిద్రాలింగన విముక్తురాలయ్యేటప్పటికి సమయం, సాయంత్రం ఐదున్నర.

రాత్రి ఎనిమిదిగంటలప్పుడు, అంజయ్య మెల్లగా శ్యామ దగ్గరికొచ్చి, "అమ్మా! అయ్యగారు ఫోన్‌చేశారు. ఎక్కడో దూరం నుంచి మాట్లాడారు. రావటానికి కాస్త ఆలస్యమవుతుంది కాబట్టి, మిమ్మల్ని భోంచేసి పడుకోమన్నారు." అని బాధగా చెప్పాడు.

ఆ విషయం విని, శ్యామ నిర్ఘాంతపోయింది తన చెవుల్ని తానే నమ్మలేకపోయింది, క్రూరబాణాలు వచ్చి తగులుతున్నట్టు చేతులతో, చెవులు గట్టిగా మూసుకుని, కిందకి చూస్తుంటే, ఆమె లోలోపల్లోనుంచి అంకురించిన బెక్కు, కంఠనాళం ద్వారా బహిర్గతమవడానికి ప్రయత్నిస్తుండగా, దానిని లోపలికే అణచివేయడానికి ప్రయత్నిస్తున్నట్లు, దాదాపుగా ఆ ముసలి అంజయ్యకి అర్థమైంది.

"అమ్మా! మీరేమి అనుకోవద్దు. మీరు పడుతున్న బాధ ఈ ముసలివాడికి అర్థమవుతోంది. కానీ, నేనొక విషయం చెప్తా. మా అయ్యగారు బంగారంలాంటి మనిషి, కోపం కాస్త ఎక్కువే అయినా, ఇంతవరకూ ఎవరికీ ఎలాంటి అపకారం చెయ్యలేదు, ఇక మీదట చెయ్యబోరు. నేనిక్కడ వట్టి పనివాడినయినా నన్ను పెద్దదిక్కుగా భావిస్తారు. ఆయనకి నా అన్న వారెవరూ లేరనే బెంగ ఉన్నట్టు నాకనిపించింది. చిన్నప్పుడే ఆయన తల్లిపోవడం వలన, తండ్రి రెండోపెళ్ళి చేసుకున్నారట. సవతీతల్లి తీరు మా అయ్యగారికి నచ్చలే, ఆ తండ్రి ఇప్పటిక్కూడా పెళ్ళాం కొంగుచాటు మొగుడే. చూశారు కదా, మీ పెళ్ళిలో ఆమె పరాయిదానిలా ఒక మూల నుంచుని ఉంది. పెళ్ళవగానే, అతన్ని పట్టుకుని పారిపోయింది. పాపం మా అయ్యగారు వంటరివాడు. ఎంతో కష్టపడి యింతెత్తుకు ఎదిగాడు. పగలూ,

రాత్రీ తేడా లేకుండా ఆయన కష్టపడి పనిచేస్తారు. టీవీ ప్రోగ్రాములు చూసి కూడా ఆయన ఆనందించరు. వార్తలు మాత్రమే చూస్తారు. ఆయనకి స్నేహితులు కూడా చాలా తక్కువే. అందుకే, రాత్రుళ్ళు కొద్దిగా తాగడం ఆయనకి అలవాటయిపోయింది. ఇంతవరకూ ఈ యింట్లో ఒక్కమ్మాయి కూడా కాలుపెట్టలేదనే కాదు, ఒక్క అమ్మాయినయినా తలెత్తిచూడరు. అటువంటి అయ్యగారు పెళ్ళి చేసుకోబోతున్నారని తెలియగానే నాకు భలే ఆచర్యమేసింది. ఆ విషయంలో ఎక్కువ సంతోషించేవాడిని కూడా నేనే. మీరేమాత్రం బాధపడవద్దమ్మా! ఈ ఒంటరివాడిని మచ్చిక చేసుకోవడానికి కాస్త సమయం పడుతుంది. మీరు తప్పకుండా అది సాధించగలరు. మా అయ్యగారు మంచివారమ్మ....చాలా మంచివారు.

ఆ రాత్రి, జనార్ధనరావు యింటికి తిరిగి వచ్చేటప్పటికి ఒంటిగంట దాటింది. శ్యామ, సోఫామీద నిద్రపోయినట్టు నటిస్తూ పడుకుంది. గదిలోకి రాగానే, అతను సోఫా దగ్గరికి వచ్చి, ఆమెని ఆపాదమస్తకం చూస్తూ, కాస్సేపు అక్కడే నుంచుండిపోయాడు. అతను తనపైన దాడి చేస్తాడేమోనని, శ్యామ భయపడింది. సోఫా పక్కనే ఉన్న చిన్నబల్లమీద ఆమె తెరచిపెట్టిన పుస్తకాన్ని, అతను మూసేసి మంచంమీద పడుకున్నాడు. పదినిముషాల్లో గురక కూడా మొదలెట్టాడు. బాగా అలిసిపోయి ఉండటంవలన, కాస్సేపట్లో ఆమెకూడా నిద్రలోకి జారుకుంది.

మరుసటి రోజు ఉదయం ఆమె లేచేటప్పటికి, జనార్ధనరావు మంచి నిద్రలో ఉన్నాడు. స్నానాదికాలు ముగించుకుని కిందికి వెళ్ళి, బ్రేక్‌ఫాస్ట్‌కి ఏం తయారుచేస్తున్నావని అంజయ్యని అడిగి, బయటికి వెళ్ళి తోటలో ఉన్న మొక్కలకి హోస్‌పైపుతో ఆమె నీళ్ళుపోస్తుండగా, అంజయ్య లోపల్నించి పరుగెత్తుకొచ్చి, "అమ్మా.... అమ్మా! మీకెందుకమ్మా ఇటువంటి పనులు? ఇవన్నీ ఈ ముసలివాడు చేసేపనులు వంటయింతర్వాత నేనే చేస్తాను."

"ఫర్వాలేదు అంజయ్యా...ఫరవాలేదు ఇటువంటి చిన్న చిన్న పనులు చేయడం నాకిష్టమే" అంటూ, శ్యామ తనపనికొనసాగించింది. తరువాత, వరండాలో ఏడ్చేందుకు గానీ, కదలడానికి గానీ, సత్తువలేకుండా పక్షవాతంతో, నిస్సహాయస్థితిలో ఉన్న శిశువులా పడున్న వార్తాపత్రికను ఆమె చేతుల్లోకి తీసుకుని తెరచిన వెంటనే, అది సంతోషంతో కేరింతలు కొట్టింది.

జనార్ధనరావు బట్టలు వేసుకుని, బయటికి తయారయ్యి డైనింగ్ టేబుల్ దగ్గరికి వచ్చాడు. అంజయ్య గబగబా వచ్చి వాళ్ళిద్దరికీ టేబుల్ మీదప్లేట్లు రేడీచేశాడు. జనార్ధన్, శ్యామని కూర్చోమని చెప్పకపోవడంతో ఆమె కూర్చోలేదు. ఒక కుర్చీమీద చేతులానించి ఆమె అలా నిల్చుని ఉండగానే, అతను బ్రేక్‌ఫాస్ట్ చేయడం మొదలుపెట్టారు.

"శ్యామా! ఒక వారం రోజులపాటు నేను నా కాంట్రాక్టు పనిమీద ఊరికి వెళ్తున్నాను. నాకు అక్కడ చాలా పనులు ఉన్నాయి. మనం, మాట్లాడుకోవలసినదంతా నేను ఊర్నుంచి వచ్చిన తరువాత మాట్లాడుకుందాము. అందాకా, కావాలంటే నువ్వు మీ యింటికి వెళ్ళి ఉండు" అన్నాడు జనార్ధన్.

"నేను కూడా మీతో వస్తే, మీకేమయినా ఇబ్బందా?" నేల చూపులు చూస్తే, శ్యామ అడిగింది.

"వర్క్‌స్పాట్‌లో, ఆడవాళ్ళు ఉండటానికి సౌకర్యాలేమీ ఉండవు." అని, "దీనిపైన యిక చర్చ అనవసరం, అనే అర్థం ధ్వనించేలా, అతను ఖచ్చితంగా చెప్పినప్పుడు, ఇక మౌనం పాటించడమే మంచిదనే సద్బుద్ధి శ్యామకు కలిగింది.

అంజయ్య సూట్‌కేసు తీసుకెళ్ళి కారులో పెట్టాడు. మరేమీ మాట్లాడకుండా, జనార్ధనరావు కారెక్కి కూర్చోవడం వల్ల, "నాథా! క్షేమంగా వెళ్ళి లాభంగా రండి" అని అనాలని కూడా శ్యామకు తోచలేదు.

"బెంగపెట్టుకోవద్దమ్మా! మీరు లోపలికొచ్చి టిఫిన్ చేయండి." అని అంజయ్య కోరినప్పుడు,

"వద్దు, అంజయ్యా! ఆయన తినడం చూసినప్పుడే నాకు కడుపు నిండిపోయింది." అంటూ శ్యామ తన అసంతృప్తిని ప్రకటించింది. బ్రేక్‌ఫాస్ట్‌కి అయ్యగారు, ఆమెను తనతోపాటు కూర్చోమని చెప్పకపోవడంతో బాధపడిందని, అర్థం చేసుకున్న అంజయ్య, "అమ్మా! ఆయన పాతకాలపు మనిషమ్మా! భార్యతో కూర్చుని భోజనం చేయడం ఆయనకి నచ్చదు. భర్త భోంచేసిన తరువాతే, భార్య భోజనం చేయాలనేది ఆయన ఉద్దేశ్యం. అదేవిధంగా, క్రమశిక్షణ విషయంలో ఆయనకి చాలా పట్టింపు. ఆయనేదయినా చెబితే, దానికి ఎదురు చెప్పడానికి, ఆయన ప్రాణస్నేహితులు సైతం జడుస్తారు. అందుకేనమ్మా! మీరాయనని మెల్లిగా మచ్చికచేసుకోవాలి."

"మచ్చిక చేసుకోవడానికి ఆయన దొరికితే కదా! నా స్నేహితురాళ్ళందరూ తమ వైవాహిక జీవితాన్ని ఎంతో సంతోషంగా గడుపుతున్నారు. ఆ భార్యా భర్తలు కలిసి భోజనం చేస్తారు. కలిసి పడుకుంటారు. కలిసి టీవీ చూస్తారు. కలిసి నాటకాలకీ, సినిమాలకీ వెలతారు....కలిసి విందులకి, బంధు మిత్రులింటికీ వెళతారు. కలిసి కూర్చుని మాట్లాడుకుంటారు,తర్కించుకుంటారు, పోట్లాడుకుంటారు, ప్రణయ కలహాలు సృష్టించుకుంటారు.....ఆవిధంగా, ఒక చిన్న కుటుంబంలో ఎన్నెన్ని విషయాలు జరుగుతాయి!

నా వరకూ వచ్చేటప్పటికి, పెళ్ళి జరిగినా జరగకపోయినా ఒకేలా ఉందే, నా మొదటిరాత్రి కోసం ఇంకా ఎన్ని రాత్రులు ఇలా గడపాలి? ఆయన ఎప్పటకైనా నన్ను తన భార్యగా అంగీకరిస్తారా? వారెప్పుడయినా నాతో ప్రేమగా వ్యవహరిస్తారా? నా శరీరాన్ని చూడాలనే కోరిక ఆయనకెప్పుడయినా కలుగుతుందా? నా ముఖం చూసి ఆయనెప్పుడయినా రెండు మంచిమాటలు మాట్లాడతారా? పనిచేయడం డబ్బు సంపాదించడం- తాగడం ఇంతేనా ఆయన జీవితం! అలాగయితే, నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు? నన్నిక్కడికి పనిమనిషిగా తెచ్చుకున్నారా! లేకపోతే, మంచం మీద, ఆయన పక్కన నాకు చోటెందుకు ఇవ్వలేదు?"

ఇలా ఆలోచించి, ఆలోచించి, మానసికంగా కృంగిపోతున్న శ్యామకు, తను నడిసముద్రంలో, ఒక కొయ్య ముక్కను పట్టుకుని వేలాడుతున్నట్టు అనిపించింది. ఇక తీరాన్ని చేరేదెప్పుడు? ఒక సామాన్య స్త్రీకి లభించే జీవనరీతి తనకెప్పుడు దొరుకుతుంది? తనకు గొప్ప సుఖాలూ, సౌకర్యాలు అక్కర్లేదు. ఒక మామూలు కూలీవాడి భార్యకు ఉండే సంతృప్తికర జీవితం, దేవుడు తనకెందుకు ఇవ్వలేదు.

మూడు రోజుల తరువాత, అంజయ్యకి, జనార్ధన్‌రావు నుంచి ఫోన్ సందేశం అందింది. మరో నాలుగు రోజుల తర్వాత ఇంకో సందేశం. ఆ రెండో సందేశం ప్రకారంగా, ఆయన తిరిగి వచ్చేది మూడు నాలుగు రోజుల తరువాతేనని తెలిసినప్పుడు, ఆమెలో కోపం పెద్దపెట్టున ప్రజ్వరిల్లింది. ఈ ప్రపంచం మొత్తం మీద ఆమెకు ద్వేషభావం కలిగింది. ఆహార పానీయాల మీద విరక్తి పుట్టింది. రాత్రుళ్ళు నిద్రపట్టడం లేదు. పగలు అనుకోకుండా నిద్రపోతుంది. "ఇతనెటువంటి మనిషి! ఎలాంటి భర్త!" అని, వేదన, కోపం కలిసిన ఆశ్చర్యం కలిగింది. మధువిధుని ఆస్వాదించాల్సిన ఈ సమయంలో, పనిపేరుతో అతను తన నుంచి ఎంత దూరంగా ఉన్నాడు? తిరిగి రావడానికి ఆలస్యమవుతుందున్న విషయం, తనతో కాక వంటవాడికి చెప్తాడా? ఆమె మనసు ఒక అగ్నిగుండంలా మారింది.

శ్యామ తల్లిదండ్రులు, చెల్లెలు ఫోన్‌చేసి, ఆమె యోగక్షేమాలు కనుక్కుంటున్నప్పుడు, భర్తతో తను తీరుబడి లేకుండా ఉన్నానని, రోజులెంతో ఆనందమయంగా ఉన్నాయని, అబద్ధాలు చెప్పకుండా ఉండలేకపోయింది. వాళ్ళు, శ్యామని వచ్చి చూడాలనుకుంటుంటే, ఏదో ఒక సాకుతో రానీయకుండా చేసేది.

ఒకరోజు ఉదయం లేచేటప్పటికి, ఆమెకి చాలా నీరసంగా అనిపించింది. సోఫాలో నిద్రపోయిన ఆమె నేలమీద పడుంది. భర్తతో మంచం మీద నిద్రపోవడానికి, ఆహ్వానం లేకపోవడం వల్ల, అతను లేనప్పుడు కూడా ఆ మంచం మీద పడుకునేది కాదు.. నాలుక కాస్త నొప్పిగా, తిమ్మిరిగా అనిపించింది. బాత్‌రూమ్‌కి వెళ్ళి అద్దంలో చూసుకునేటప్పుడు,

తనకు స్పృహ తప్పిపోతుందేమోనని భయం వేసింది. ఎందుకంటే, నాలుక కొద్దిగా తెగినట్లు, నోటినుంచి కొంచెం రక్తంతో కలిసిన నురుగు వచ్చి, ఎండిపోయిన గుర్తులు ఆమెకి కనిపించాయి. తను, ఒక మూర్ఛరోగి అయిన విషయంలో, సందేహపడటానికి అవకాశమే లేదని ఆమె నిర్ధారించుకుంది. అప్పుడు, ఆమెలో మొదలైన కంగారు, క్షణక్షణానికీ పెరుగుతూ వచ్చింది. మధ్యాహ్నంలోపల, అనుకోకుండానే, ఒక పుస్తకాన్ని నోటితో చింపి, ముక్కలు ముక్కలు చేసింది. ఆ తరువాతే, ఆమెకు అర్థమైంది, తను చేసినది ఎంత పిచ్చిపనో! "ఓ దేవుడా! నాకు మతిభ్రమ కూడా ప్రసాదించావా?" అని వేదనతో దేవుడిని తిట్టింది. తరువాత, ఆమె పిచ్చిపట్టిన దానిలాగే ప్రవర్తించింది. బయటెవరికీ, వినిపించకుండా, ఆమె పెద్దగా ఏడ్చింది.....పెద్దగా నవ్వింది. అర్ధశూన్యమైన తన జీవితం గురించి విలపించింది.

ఆ రోజు రాత్రి అంజయ్యకి మళ్ళీ ఫోన్ వచ్చింది. మర్నాడు సాయంత్రం, జనార్ధన్‌రావు తిరిగి వస్తున్నాడని. ఇక, అతనికి అభిముఖంగా ఎలా ప్రవర్తించాలి? ఏం మాట్లాడాలి? ఆమెకేమీ తోచలేదు. రేపు రాబోతున్న తొలిరాత్రి ఎలా ఉంటుందోనని ఊహించేటప్పుడు, ఒక దెయ్యం ఆమెని మింగడానికి దగ్గరగా వస్తున్నట్టు ఆమెకి అనిపించింది.

నిద్రావిహీనమైన ఆ రాత్రి ఆమెని బాగా బాధపెట్టింది. మరుసటిరోజు, పొద్దుటే లేచి, స్నానం అదీ ముగించి, టిఫిన్‌చేసిన తర్వాత,

"అంజయ్యా! ఈ రోజు సాయంత్రం ఆయన వస్తున్నారు కదా! అందుకే, నేనిప్పుడు వెళ్ళి మా అమ్మా నాన్నని, చెల్లెలిని కలిసి వస్తాను." అని చెప్పింది శ్యామ.

"అమ్మగారూ! మీకు ఎన్నిసార్లు ఈ విషయం చెప్పాను. కనీసం, ఈ రోజయినా వాళ్ళని చూడాలనిపించింది మీకు మంచిది. మిమ్మల్ని చూడాలని వాళ్ళక్కూడా ఎంతో ఆత్రంగా ఉంటుంది." సంతోషంగా స్పందించాడు. అంజయ్య వెంటనే, జనార్ధన్‌రావు మిత్రుడొకరికి ఫోన్‌చేసి, ఆమె వెళ్ళి రావడానికి కారు కూడా తెప్పించాడు.

"అమ్మా! మీరు యింటికి వెళ్ళగానే కారుని తిరిగి పంపించక్కరలేదు. మీరు తిరిగి వచ్చిన తర్వాతే ఇవ్వవచ్చు."

శ్యామని చూడగానే సీతాలక్ష్మి పరుగు పరుగున వచ్చి, "ఎన్నాళ్ళయిందమ్మా! నిన్ను చూసి, ఇప్పటివరకూ నువ్వెందుకు రాలేదు? కనీసం, మమ్మల్ని అయినా అక్కడికి రానివ్వలేదు. నువ్వక్కడ సంతోషంగానే ఉన్నావు కదా?" అని ప్రశ్నల వర్షం కురిపిస్తూ, కూతుర్ని దగ్గరికి తీసుకుంది. తల్లి భుజం మీద తలవాల్చి నిలబడిన శ్యామ కళ్ళనుంచి వెచ్చని కన్నీరు ప్రవహించింది. ఆమె లోలోపల అణచిపెట్టిన బెక్కులను ప్రేమమూర్తి అయిన ఆ తల్లి గ్రహించింది. కూతురి భుజాలని గట్టిగా పట్టుకుని.

"అమ్మా! నీకు సమస్యలేమయినా ఉన్నాయా! ఎందుకలా ఏడుస్తున్నావు?" కంగారుగా అడిగింది.

"అబ్బే, అటువంటిదేమీ లేదమ్మా! ఇన్ని రోజులు మీకు దూరంగా ఉండటం ఇదే మొదటిసారి కదా! అన్నట్టు నాన్నగారెక్కడా?"

"మీ నాన్నగారు ఒక పార్టీని కలవడానికి బయటికి వెళ్ళా. మధ్యాహ్నం భోజనాల టైముకి ముందే, ఇంటికి వచ్చేస్తారు."

"అయితే, నేనీలోగా వెళ్ళి రాధని చూసి వస్తాను. కానీ, మధ్యాహ్నం మాత్రం మీతోనే భోజనం చేస్తాను."

"నువ్వక్కడికి వెళ్ళక్కర్లేదు. నేను ఫోన్‌చేసి, రాధనే ఇక్కడికి రమ్మంటాను. తనతో బాటు బాబుని కూడా తీసుకొస్తుంది. నీతో కాస్సేపు కూర్చుని మాట్లాడాలనుంది. నీ పెళ్ళయిన తర్వాత ఫోన్‌లో మాట్లాడటమే తప్ప ఒక్కసారయినా కలిసిందే లేదు, అంటూ, సీతాలక్ష్మి శ్యామని ఒక సోఫాలో కూర్చోబెట్టింది.

భర్త యింటిలో తనకెటువంటి లోటూ లేదని, ఎంతో సుఖంగా ఉందనీ, శ్యామ చెప్పింది. ఎక్కువగా మాట్లాడని మనిషయినా, పనిలో ఎంత బిజీగాఉన్నప్పటికీ ఆయనకి తనంటే చాలా ప్రేమని చెప్పడంతో సీతాలక్ష్మి మనస్సు స్థిమితపడింది. ఇంటిపనులు చేయడానికి పనిమనిషి, వంటచేయడానికి బట్లరు ఉండటం వల్ల తనకి ఏ పని ఉండదనీ, ఒకవేళ, ఏదయినా పని చేయబోయినా, వారిద్దరూ చెయ్యనివ్వరని చెప్పినప్పుడు,

"అయినా సరే, నువ్వే ఏదో ఒకటి చేస్తుండాలి. వంటింట్లోకి వెళ్ళి, నువ్వు ఏదయినా స్పెషల్ ఐటమ్ వండిపెడితే, మీ ఆయనకి ఎంతో సంతోషంగానూ, గర్వంగానూ, ఉంటుంది. అదే విధంగా, ఇంటిని అలంకరించడంలో కూడా నువ్వు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి" అని సీతాలక్ష్మి ఉపదేశించింది.

"అమ్మా! నేను నా రూమ్‌లోకి వెళ్ళి కాస్సేపు పడుకుంటాను. తలనొప్పిగా ఉంది. రాధ రాగానే నన్ను లేపు....నాన్నగారొచ్చినా కూడా! సరేనా!" అంటూ, శ్యామ తన గదిలోకి వెళ్ళింది.

సీతాలక్ష్మి, వంటింట్లో, మంచి భోజనం తయారు చేయడంలో నిమగ్నమైంది.

శ్యామ గదిలోకి వెళ్ళి, తనకి అవసరమైన వస్తువులు కొన్ని బ్యాగులో వేసుకుంది. ఆ గదిలో ఎటువంటి మార్పులు రాలేదు. తను రెండు వారాల కిందట విడిచిపెట్టిన ఆ

పడకగది.....తనెన్నో రాత్రుళ్ళు, పగళ్ళూ గడిపిన ఆ గది......దాన్ని వదిలి వెళ్ళిపోయిన సందర్భం గుర్తొచ్చి ఆమె కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. కాస్సేపు కళ్ళు మూసుకొని మంచం మీద పడుకోవడంతో ఆమెకి ఎంతో హాయిగా అనిపించింది. "ఎన్ని రోజుల తరువాత నేను మంచం మీద పడుకుంటున్నాను!" భర్త అని చెప్పబడుతున్న ఆ మనిషి ఇంట్లో, సోఫాలో పడుకుని, పడుకుని, ఆమెకు విసుగెత్తింది. కొన్ని కొన్ని రాత్రుళ్ళు నిద్రపట్టక అర్ధరాత్రి లేచి సోఫాని వదిలేసి నేలమీద పడుకునేది. అరగంటయినా కాలేదు. రాధ కొడుకుని తీసుకుని, శ్యామ గదిలోకి వచ్చింది. శ్యామ టక్కునలేచి, చెల్లెలిని దగ్గరికి తీసుకునేసరికి, తెలియకుండానే, కళ్ళ నుంచి నీళ్ళు ప్రవహించాయి. అక్క మనోభావం కానీ, ముఖభావం కానీ, రాధ అర్థం చేసుకోలేదేమో! బాబుని రెండు చేతులతో గుండెలకు హత్తుకుని, మునుపెన్నడూ చేయని విధంగా, ముద్దుల వర్షం కురిపించింది. అక్కా చెల్లెళ్ళిద్దరూ ఆ గదిలో కూర్చుని కాస్సేపు పిచ్చాపాటి కబుర్లు చెప్పుకున్న తర్వాత, వంటింట్లో హడావిడిగా వంటచేస్తున్న తల్లి దగ్గరకు చేరి తమ సంభాషణను కొనసాగించారు.

"అక్కా! నువ్వు బాబుని తీసుకెళ్ళి బయట అడిస్తుంటే, నేను అమ్మకి ఇక్కడ సహాయం చేస్తాను." అని రాధ అన్నప్పుడు.

"అమ్మకి సహాయం చేయడం నావల్ల కాదా!" నవ్వుతూ శ్యామ అడిగింది.

"అది సమంజసం కాదే. ఈ రోజు నువ్వు ఇక్కడ వి.ఐ.పి.వి. అమ్మ ఇవ్వాల్టి భోజనం బ్రహ్మాండంగా తయారు చేసేది కొత్త పెళ్ళి కూతురి కోసమే కదా!" అంటూ, రాధ అక్కకి చక్కిలిగింతలు పెట్టింది. శ్యామ ముఖం మీద కారు మేఘాలు కమ్ముకున్న విషయం, ఆ చెల్లెలు గమనించలేదు.

అదే సమయానికి, మధుసూదనరావు కూడా యింటికి వచ్చేసాడు. కాస్సేపు, నలుగురూ కూర్చుని మాట్లాడుకున్నాకా, రాధ, సీతాలక్ష్మి, తిరిగి వంటింట్లోకి వెళ్ళి వారిపని కొనసాగించసాగారు. మధుసూదనరావు, శ్యామ, బాబుని ఆడిస్తూ, ఏవేవో మాట్లాడుకుంటూ ఉన్నారు. మధుసూదనరావుకి పెద్ద కూతురిపట్ల ప్రేమా, వాత్సల్యాల కన్నా సానుభూతే ఎక్కువ. కొత్త పెళ్ళికూతురి ముఖంలో ఉండాల్సిన మెరుపు శ్యామ వదనంలో కనిపించడంలేదని, ఆ స్థానంలో నిరాశా నీడలు కదలాడుతున్నాయిని అతనికి అనుమానం కలిగింది. దాని గురించి, ఆయన కూతురిని విచారించినప్పుడు, తమ వైవాహిక జీవితం, అత్యంత సంతోషంగా, సుఖప్రదంగా ఉందని చెప్పింది. అలా చెబుతున్నప్పుడు, శ్యామ కళ్ళల్లో నిలిచిన నీరు ఆయన కంటబడలేదు.

మధ్యాహ్నపు భోజనం బ్రహ్మాండంగా ఉండింది. శ్యామకి ఎంతో ఇష్టమైన పాయసం కూడా సీతాలక్ష్మి తయారు చేసింది. పదిరోజులపాటు, పస్తున్న మనిషిలా... మధ్యాహ్నం, రాత్రి భోజనంపై ఖర్చు పెట్టకుండా ఉండటానికి, ఒక బఫే బ్రేక్‌ఫాస్ట్‌ని ఆబగా, ఒక యజ్ఞంలాగా భోజనం చేస్తున్న దానిలా, శ్యామ ఆత్రంగా తినడాన్ని చూసి, ఆ చిన్నబాబు తప్ప మిగతా ముగ్గురు ఆశ్చర్యపోయారు.

"ఎందుకమ్మా! అలా గబగబా తింటున్నావు? మెల్లగా తినవచ్చు కదా! కావలసినంత టైముంది." అని గుడ్లు బైటకి పొడుచుకువచ్చిన సీతాలక్ష్మి అడిగింది.

"లేదమ్మా! లేదు నాకు భోజనం చేయడానికి ఎక్కువ టైము లేదు" జవాబిచ్చింది శ్యామ.

"ఏం? తొందరగా తిరిగి వెళ్ళాలా?"

"అవునమ్మా!" అంటూ, ఆమె గణపతి స్త్రీ రూపం ధరించినట్లు తనపనిలో నిమగ్నమైంది. శ్యామ తన జీవితంలో ఎన్నడూ ఇంత ఎక్కువ భోజనం చేసుండదు.

భోజనానంతరం, అక్క అజీర్ణంతో బాధపడకుండా ఉండటానికి, రాధ రెండు యూనీ ఎంజైమ్ టాబ్లెట్లు ఇచ్చింది. "అక్క మీద నీకెంత ప్రేమ!" అంటూ, శ్యామ చెల్లెలిని గాఢంగా కౌగలించుకుంది.

సాయంత్రం వరకూ శ్యామ అక్కడే ఉండి, అమ్మానాన్నలతో, చెల్లెలితో చాలా సరదాగా, సంతోషంగా గడిపింది.

ఐదున్నరకు సజలనేత్రాలతో వారి దగ్గరినుంచి శెలవు తీసుకుంది.

ఆమె తన యింటికి చేరుకునేటప్పటికి, అంజయ్య బయట నిలబడి ఎదురు చేస్తున్నాడు. అమ్మా! అయ్యగారు మళ్ళీ ఫోన్ చేశారు. రాత్రి ఎనిమిది గంటలకల్లా ఇక్కడుంటారట. ఇంటికి వచ్చాకే భోజనం చేస్తారట. మీకు సంతోషమే కదమ్మా! తమరి అమ్మగారు, నాన్నగారు భాగానే ఉన్నారు కదా!" అని అడిగాడు.

"అందరూ బాగానే ఉన్నారు. నేనెళ్ళి స్నానం చేసొస్తాను." అంటూ, ఆమె బెడ్రూమ్‌కి వెళ్ళింది.

వంటపూర్తిచేసి, దాదాపు ఎనిమిదిన్నర అయ్యేటప్పుడు, కూల్‌డ్రింక్ ఏమైనా తాగుతారేమోనని అంజయ్య, శ్యామ గది తలుపులు రెండు మూడుసార్లు తట్టాడు. లోపల్నుంచి ఎటువంటి చప్పుడూ రాలేదు. మధ్యాహ్నమంతా అలిసిపోవడంతో, ఏదో పత్రిక చదువుతూ, చదువుతూ నిద్రపోయిందేమోనని, తిరిగి వంటింట్లోకి వెళ్ళిపోయాడు.

జనార్ధన్ ఊరునుంచి వచ్చేటప్పటికి పదిగంటలు అయ్యి ఉంటుంది. సాయంత్రం కోటాను స్నేహితుడింట్లోనే కూర్చుని పూర్తిచేసి వచ్చాడని అంజయ్యకి అర్థమైంది.

"భోజనం వడ్డించెయ్యనా అయ్యగారు!" అంటూ, ఇంకా తాగుతారా అనే అర్థం ధ్వనించేలా అంజయ్య అడిగాడు.

"నేను బాత్రూమ్‌కి వెళ్ళి వస్తాను." అంటూ అతను పైకెళ్ళాడు.

గదంతా చీకిటి. లైట్లు వేశాడు. తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు. "ఏమిటీ? నేనింత ఎక్కువ తాగానా? అనుకుంటూ, కళ్ళు గట్టిగా నులుముకుని, మళ్ళీ చూశాడు. తెల్లటి బెడ్‌షీట్‌పైన ముదురు తేనెరంగులో ఉన్న శ్యామ శరీరం, నూలుపోగయినా లేకుండా..."ఈమె చేసినపనేంటి? అంజయ్యగానీ, ఒకవేళ లోపలికి వచ్చి ఉంటే.... ఛీ....ఛీ..కానీ, అతను చాలా మర్యాదస్తుడు.. ఈ గదిలో కాలు కూడా పెట్టడు. ఈమె నిద్రపోతున్నట్లు నటిస్తోందా, ఏమిటి? ఇంతవరకూ తొలిరాత్రి అనుభవించలేదు, కాబట్టి, తాగి వస్తున్న నన్ను ప్రలోభింపజేయడానికి, మేకలా తయారైపడుకుందా.... ఏమయినా, ఇది సిగ్గులేనిపని.... కానీ, ఇంత చూసిన తర్వాత కూడా నాలో కామావేశమేమీ కలగడం లేదే? ఎంతయినా...ఇలా చూస్తూ నిలబడడం నా వల్ల కాదు.

ఒక బెడ్‌షీట్ తీసుకుని ఆమెకి కప్పాడు. అప్పుడు కూడా ఆమె లేవలేదు. మంచం పక్కనే ఉన్న చిన్న టేబుల్‌మీద ఉంచిన ఒక పెద్ద తెల్లని కాగితం మీద ఏదో రాసి ఉండటం అతను గమనించాడు.

"క్షమించండి. నా జీవితంలో ఇదే మొదటిసారీ, ఆఖరి సారీ చేసే సిగ్గులేని పని, పెళ్ళయ్యే వరకూ నా శరీరాన్ని మరెవరూ చూడకుండా కాపాడుకున్నాను. పెళ్ళయ్యాకా నా భర్తనన్ను నగ్నంగా చేస్తాడేమోననే భయం నాకుండేది. కానీ, ఇన్ని రోజులు శారీరక బంధం ఏర్పడటమనే అదృష్టం నాకు లభించకవడం వల్ల, ఒక విషయం నాకు బాగా అర్థమైంది. "సుఖం" అనేది ఇంతవరకూ నాకు ప్రాప్తించలేదు. సరియైన ఆనందాన్ని, నా మనసు ఇంతవరకు ఆస్వాదించలేదు. పెళ్ళైన తర్వాత ఏ అమ్మాయికయినా నాకు లభించినట్లు, చేదుగల మధువిధు లభించి ఉండదు. నాకు ఈ బ్రతుకు యిక చాలు అందుకే, నేను నా జీవితానికి చరమగీతం పాడుతున్నా !

కానీ, పెళ్ళైన తరువాత, ఒక్కసారి కూడా, నా భర్త నా శరీరాన్ని చూడలేదు. అందుకే, ఇది నా చివరి కోరిక, కనీసం, నే కన్ను మూసిన తర్వాత నన్ను భార్యగా ఒకసారి వీక్షించండి."